సాక్షి విశాఖపట్నం

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



'బాల్యం బడి'పై ఫోకస్

బాల్యం బడిలో చిన్నారుల చదువులు సవ్యంగా సాగేలా దృష్టి సారించారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. IIలో



ముడసర్లోవ ఆధునికీకరణ

ముడసర్లోవ పార్కు ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. IIలో



వినాయక నిమజ్జనం

IIలో

చంద్రబాబు అరెస్టు సక్రమమే!

- చట్ట ప్రకారమే సీఐడీ నడుచుకుంది
- అవినీతికి పాల్పడిన మాజీ సీఎంలు గతంలో అరెస్టయ్యారు
- చట్టం ఎవరికీ చుట్టం కాదు..
- రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్ చర్చావేదికలో వక్తలు

సాక్షి, విశాఖపట్నం: 'చట్టం ఎవరికీ చుట్టం కాదు.. అవినీతికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షకు అర్హులే. గతంలో అవినీతి ఆరోపణలతో కేసులు నమోదైన పలువురు మాజీ ముఖ్యమంత్రులు అరెస్టై జైలు కెళ్లారు. ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి అరెస్టు కూడా సక్రమమే. చట్ట ప్రకారమే సీఐడీ నడుచుకుంది' అంటూ పలువురు న్యాయ నిపుణులు పేర్కొన్నారు. వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం ఆధ్వర్యంలో రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్ పేరిట బుధవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో చర్చా వేదిక జరిగింది. దీనికి పలువురు న్యాయ నిపుణులు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ చర్చా వేదికలో ఎవరేమన్నారంటే..?



చర్చా వేదికలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ చలం



చర్చావేదికకు హాజరైన ప్రతినిధులు

దొరికితేనే దొంగ..



చంద్రబాబు ఇన్నాళ్లూ తాను నిప్పు అని చెప్పుకున్నారు. తననెవరూ ఏమీ చేయాలేరని బీరాలు పలికారు. స్కిల్ స్కాంలో అడ్డంగా దొరికిపోయారు. దీంతో దొరికితేనే దొంగ అన్న చందంగా మారింది ఆయన తీరు. స్కిల్ స్కాంపై 2021లోనే సీఐడీ క్షుణ్ణంగా దర్యాప్తు చేసింది. రూల్ ఆఫ్ లా పనిచేస్తే శిక్ష సాధింపు అంటున్నారు. ప్రభుత్వ సొమ్ము దోపిడీ చేసిన వారిని శిక్షించకూడదా? చంద్రబాబు అవినీతికి ఏళ్ల తరబడి జైల్లో ఉండాల్సి వస్తుంది.

– పాశా సత్యనారాయణ, సీనియర్ న్యాయవాది

వైఎస్సార్‌కు రాష్ట్రం రుణపడి ఉండాలి..



రాష్ట్రానికి లా యూనివర్సిటీ ఆవశ్యకతను గుర్తించి సబ్బవరంలో నల్సార్‌కు దీటైన దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయాన్ని (డీఎస్ఎల్‌యూ) దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కృషి, పట్టుదలతో ఏర్పాటు చేశారు. అందుకే ఆయన చరిత్రలో నిలిచిపోతారు. రాష్ట్రంలో అత్యున్నత విద్యా ప్రమాణాలున్న ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు రాష్ట్రానికే గర్వకారణం. వైఎస్సార్‌కు ఆంధ్ర రాష్ట్రం రుణపడి ఉండాలి. భారత్‌లో రూల్ ఆఫ్ లా ఎంతో పటిష్టంగాను, ఇతర దేశాలకు ఆదర్శంగానూ ఉంది. స్కాండిలేవియాకు ప్రపంచంలోనే అత్యంత సంతోష దేశంగా పేరు. మా ప్రజలు అవసరానికి మించి ఏమీ ఆశించరు.. అందుకే మేం అభివృద్ధి కంటే సంతోషానికే ప్రాధాన్యమిస్తామని చెప్పే ఆ దేశ పాలకుల మాటలు గమనంలోకి తీసుకోవాలి.

– వై.సత్యనారాయణ, ప్రథమ వైస్ చాన్సలర్, డీఎస్ఎల్‌యూ

ఒకే రూల్ ఆఫ్ లా అమలు కావాలి..



ప్రజా ప్రతినిధులు చేసే అవినీతిని నిరూపించడం చాలా కష్టం. ఎందుకంటే కొంతమంది తమ సహాయకుల ద్వారా అక్రమార్జనకు పాల్పడతారు. వారికి మౌఖిక ఆదేశాలివ్వడం ద్వారా దర్యాప్తు సంస్థలకు దొరక్కుండా తప్పించుకుంటారు. అందుకే ప్రధాని స్థాయి నుంచి సామాన్యుడి వరకు ఒకే రూల్ ఆఫ్ లా అమలు కావాలి. మన దేశంలో ఈ పరిస్థితి రావడానికి కొంత సమయం పట్టొచ్చు. మాజీ సీఎం చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో సమగ్ర దర్యాప్తు అనంతరం పక్కా ఆధారాలతోనే సీఐడీ అరెస్టు చేసింది. ఆయన అరెస్టు అక్రమం అనడం సరికాదు. అవినీతి చేస్తే ఎవరిపైనైనా చర్యలుంటాయన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలి.

– ఎ.సుబ్రహ్మణ్యం, ప్రథమ రిజిస్ట్రార్, డీఎస్ఎల్‌యూ

స్కిల్ స్కీం.. స్కాం అయింది..



చంద్రబాబు హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం కాస్తా స్కాంగా మారింది. చట్టం ఎవరికీ చుట్టం కాదు. ఆయనపై సీఐడీ నమోదు చేసిన సెక్షన్లతో పదేళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఆధారాల్లేకుండా చంద్రబాబును అరెస్టు చేశారంటూ ఆయన కోడలు బ్రాహ్మణి ఆరోపణలు చేస్తున్నారు. అభియోగాలున్న వ్యక్తిని అరెస్టు చేయవచ్చన్న విషయం తెలుసుకోవాలి. ఇప్పటికే ఈ స్కాంలో బాధ్యులైన చంద్రబాబు పీఏ శ్రీనివాస్, మరో వ్యక్తి విదేశాలకు పారిపోయారు. చంద్రబాబు అరెస్టు వ్యవహారాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం సరికాదు.

– బంగారి, అధ్యక్షుడు, జై ఉత్తరాంధ్ర ఫోరం

బాబులాగే ఎందరో..



అవినీతి ఆరోపణలతో దేశంలో పలువురు మాజీ ముఖ్యమంత్రులు అరెస్టై జైలుకెళ్లారు. వీరిలో బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, హర్యానా రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్ యాదవ్, మధుకోడా, మాయావతి, కరుణానిధి, యడ్యూరప్ప, ఓంప్రకాష్ చౌతాలా వంటి వారున్నారు. ఇప్పుడు చంద్రబాబు కూడా అలాంటి అవినీతి కేసులోనే అరెస్టై జైలులో ఉన్నారు. ఇదేమీ కొత్త కాదు. వీరంతా రూల్ ఆఫ్ లా ప్రకారమే అరెస్టయ్యారు.

– సుబ్బారావు, లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్

న్యూస్‌రీల్

యాదవ సంక్షేమ సంఘానికి స్థలం కేటాయింపుపై హర్షం



మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్: యాదవ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించినందుకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి హర్షం వ్యక్తం చేశారు. యాదవ సంక్షేమ సంఘం తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎండాడ జాతీయ రహదారి వద్ద అర ఎకరం స్థలం కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. స్థల కేటాయింపునకు సహకరించిన వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అన్నారు. వెనుకబడిన తరగతులకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి.. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని కొనియాడారు.

రోడ్డు విస్తరణకు ఆక్రమణలు తొలగించండి



మహారాణిపార్లర్ కూడలిలో ఫౌంటెన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: దొండపర్తి నుంచి అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్ వరకు రహదారి విస్తరణకు ఆక్రమణలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం ఆయన జోన్–5 పరిధిలో దొండపర్తి, అక్కయ్యపాలెం, మహారాణిపార్లర్, న్యూకాలనీ జంక్షన్ తదితర ప్రాంతాలలో పర్యటించారు. దొండపర్తి జంక్షన్ నుంచి అక్కయ్యపాలెం ఎన్‌హెచ్–16 వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ కోసం మార్కింగ్ చేయు విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగించి పనులు వేగవంతం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మహారాణిపార్లర్ జంక్షన్ వద్ద ఫౌంటేన్, లైటింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ సుధాకర్, ఏసీపీ రామకృష్ణ, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా బడిఈడు పిల్లల సర్వే



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ, ఆర్ఐవో సత్యనారాయణ, డీఎల్‌డీవో పూర్ణిమా దేవి

విశాఖ విద్య: బడి ఈడు పిల్లలు ఎంతమంది ఉన్నారనేది తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న సర్వే వివరాలు సమగ్రంగా ఉండాలని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. నగరంలోని 52 వార్డు సచివాలయంలో డీఎల్‌డీవో పూర్ణిమ దేవి, ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణతో కలసి సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సచివాలయ కేంద్రంగా బడిఈడు పిల్లల సర్వే జరుగుతున్నందున, సమగ్రమైన వివరాలను సేకరించాలన్నారు. ఈ విషయంలో ఏమైనా అనుమానాలు ఉన్నట్లయితే మండల విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డీఎల్‌డీవో పూర్ణిమా దేవి మాట్లాడుతూ సర్వేలో సచివాలయ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు.

ఆన్‌లైన్ కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అందిస్తున్న వివిధ పీజీ, యూజీ ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంకాం, ఎమ్మెస్సీ సైకాలజీ, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఎంఏ జర్నలిజం, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ సోషియాలజీ కోర్సులు, యూజీ ప్రోగ్రాంలో బీఏ(హెచ్‌ఈపీ), బీకామ్, బీకామ్(అకౌంటెన్సీ) కోర్సుల్లో ప్రవేశాలు జరుపుతామన్నారు. పూర్తి సమాచారం కోసం 0891 2844162, 2844764, 2754966 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముడసర్లోవకు జీవీఎంసీ కార్యాలయం తరలింపు!



దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని ముడసర్లోవకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. దసరా నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన కొనసాగించాలని బుధవారం కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో విజయవాడ నుంచి వివిధ శాఖలు ఇక్కడకు తరలిరానున్నాయి. నగరం నడిబొడ్డున, ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కనే ఉన్న జీవీఎంసీ కార్యాలయాన్ని ఏదైనా ప్రభుత్వ శాఖకు కేటాయించేందుకు చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత అధికారులతో బుధవారం ముడసర్లోవ పార్కును సందర్శించారు. అక్కడ ఉన్న స్థలాల వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో ముడసర్లోవ పార్కుకు సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోకి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని విభాగాలు తరలించడంతో పాటు దీనికి ఆనుకుని ఉన్న స్థలాల్లో కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

ఎస్‌ఐ అభ్యర్థులకు మరో అవకాశం

22న మహిళలు, 23న పురుష అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్‌ఐ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో భాగంగా దేహ దారుఢ్య పరీక్షలకు హాజరుకాని అభ్యర్థులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు డీఐజీ కె.హరికృష్ణ తెలిపారు. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో గత నెల 25 నుంచి పురుష అభ్యర్థులకు, మధ్యలో 30 నుంచి 2వ తేదీ వరకు మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆయా తేదీల్లో రోజుకు 800 మందికి హాల్ టికెట్లు పంపగా.. కొంతమంది గైర్హాజరయ్యారు. హాజరు కాలేని మహిళా అభ్యర్థులకు ఈ నెల 22న, పురుష అభ్యర్థులకు 23న ఉదయం 5 గంటల నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఐజీ తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రతీ అర్జీకి పక్కా లెక్క ఉండాలి: కలెక్టర్ మల్లికార్జున
- గోపాలపట్నంలో జగనన్నకు చెబుతాం నిర్వహణ



హాజరైన జిల్లా స్థాయి అధికారులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ విద్య: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. గోపాలపట్నం మండలం శాంతినగర్ సచివాలయం కమ్యూనిటీ హాల్‌లో బుధవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం జరిగింది. వివిధ గ్రామాలు, కాలనీల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా ప్రతీ సోమవారం జిల్లా ప్రధాన కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలకు ఈ కార్యక్రమాన్ని మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో మండల స్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈ నెల 8వ తేదీ నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు బుధవారం, శుక్రవారం వారాల్లో కార్యక్రమ షెడ్యూల్ ప్రకటించామన్నారు. ప్రజల విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే అర్జీలను జేకేసీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. వచ్చిన అర్జీల్లో 90 శాతం సచివాలయాల పరిధిలోనే ఉంటున్నాయన్నారు. శుక్రవారం విశాఖ రూరల్ మండలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, విశాఖ డెయిరీ, ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విశాఖ రాజధానితో ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి

వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



రీజినల్ కో–ఆర్డినేటర్ సుబ్బారెడ్డితో భేటీ అయిన విశాఖ జిల్లా నేతలు

కొమ్మాది: విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన సాగుతుందని, కేబినెట్ నిర్ణయం విశాఖ అభివృద్ధికి సూచికని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను పరిపాలన రాజధానిగా ఎప్పుడో ప్రకటించారని.. ఇచ్చిన మాట ప్రకారం విశాఖ కేంద్రంగా విజయదశమి నుంచి పరిపాలన ప్రారంభమవుతుందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని కావడం వల్ల ఉత్తరాంధ్ర జిల్లాలు చెందుతాయన్నారు. ఇప్పటికే విశాఖకు పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని.. సీఎం జగన్ రాకతో మరింతగా ఊపందుకుంటాయన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయ కర్త కె.కె.రాజు, ముఖ్యనేతలు సీతంరాజు సుధాకర్, జి.వి, తిప్పల దేవన్‌రెడ్డి, రవిరెడ్డి, దామా సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని అంశంలో ప్రతిపక్షాల ధోరణి మార్చుకోవాలి



ప్రొ.హనుమంతు లజపతిరాయ్

మహారాణిపేట: విజయదశమి నుంచి విశాఖ కేంద్రంగా పరిపాలన కొనసాగించాలని కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై నాన్ పొలిటికల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ పరిపాలన వికేంద్రీకరణ హర్షం వ్యక్తం చేసింది. న్యాయపరమైన వివాదాలు లేవనెత్తిన ప్రతిపక్షాలు ఇప్పటికైనా పరిపాలన రాజధాని విషయంలో తమ ధోరణి మార్చుకోవాలని జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి జరగాలంటే విశాఖ పరిపాలన రాజధాని కావడం అత్యంత ఆవశ్యకమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం గతంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణ కమిటీ ఆధారంగా జరిగిందని, కాబట్టి ఇది న్యాయ సమ్మతంగా ఉందన్నారు. త్వరలోనే సుప్రీంకోర్టు కూడా దీనిని పరిగణలోకి తీసుకుంటుందనే ఆశాభావాన్ని జేఏసీ వ్యక్తం చేస్తోందన్నారు.

పత్రికా రంగంలో వ్యవహారిక భాష ఆయన ఘనతే..

ఘనంగా తాపీ ధర్మారావు జయంతి



తాపీ ధర్మారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, తదితరులు

ఏయూక్యాంపస్: పత్రికా రంగంలో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన ఘనత తాపీ ధర్మారావుకే దక్కుతుందని.. అందుకే ఆయన పుట్టినరోజును తెలుగు మాధ్యమాల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు తెలిపారు. రాష్ట్ర అధికార భాషా సంఘం, ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఏయూ తెలుగు విభాగంలో బుధవారం తెలుగు మాధ్యమాల దినోత్సవం–తాపీ ధర్మారావు జయంతి వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన విజయబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తాపీ ధర్మారావు జీవితం మొదట సంప్రదాయవాదిగా ప్రారంభమై.. విస్తృత పుస్తక పఠనంతో హేతువాదిగా, నాస్తికుడిగా మారారన్నారు. ధర్మారావు గతాన్ని వర్తమానానికి, భవిష్యత్‌కి అలంబన చేసుకుని రచనలు చేశారన్నారు. ఆయన రచనలన్నీ పరిశోధనాత్మక దృక్పథంతో రచించినవేనన్నారు. ధర్మారావు సాహిత్యానికి, పత్రికారంగానికి సేవలందిస్తూ వ్యవహారిక భాషోద్యమానికి ఊతంగా నిలిచారన్నారు. ఆచార్య జి.యోహాన్‌బాబు మాట్లాడుతూ తాపీ ధర్మారావు సత్యనిష్ఠగల వ్యక్తని.. విషయాన్ని సూటిగా చెప్పడం ఆయన ప్రత్యేకతన్నారు. ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లాడుతూ ధర్మారావు పేరులోనే ధర్మం ఉందని దానిని జీవితంలో పాటించి పది మందిని ఆ మార్గం వైపు ప్రయాణించేలా చేసిన మహనీయుడన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డి.వి.సూర్యారావు తదితరులు ప్రసంగించారు. తెలుగు ఆచార్యులు డాక్టర్ సీతారత్నం, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య, డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త పి.కన్నయ్య, డాక్టర్ సుబ్బారావు, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో తాపీ ధర్మారావు

శాస్త్రీయ దృక్పథంతో రచనలు చేసిన తాపీ ధర్మారావు చిరస్థాయిగా ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. ఏయూ అంబేడ్కర్ అసెంబ్లీ మందిరంలో నిర్వహించిన తెలుగు మాధ్యమాల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ధర్మారావు సమాజ ఉపయుక్తంగా గ్రంథాలు రచించారన్నారు. ఆయన ఉపయోగించిన భాష, పదాలు నేటికీ ప్రజల నోళ్లలో నానుతున్నాయన్నారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నరసింహా రావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య ఎస్.అనురాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంగీత విభావరి, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పలువురు ఏఎంసీ ప్రొఫెసర్లకు పదోన్నతులు

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా అశోక్‌కుమార్ కొనసాగింపు



అశోక్ కుమార్

మహారాణిపేట: ఆంధ్రా వైద్య కళాశాల, కేజీహెచ్‌లో పనిచేస్తున్న పలువురు ప్రొఫెసర్లకు అడిషనల్ డీఎంఈ(డైరెక్టర్ అండ్ మెడికల్ ఎడ్యుకేషన్)లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు వీరిని పలు ప్రాంతాల్లో అడిషనల్ డీఎంఈ క్యాడర్‌లో నియమిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్‌కు అడిషనల్ డీఎంఈగా పదోన్నతి కల్పించి.. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గానే కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చారు. ఏఎంసీలో రేడియోథెరపీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ఏడుకొండలరావును పదోన్నతిపై ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈఎన్‌టీ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ కె.జీవన్ ప్రదీప్‌ను గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, న్యూరో సర్జరీ విభాగ ప్రొఫెసర్ ప్రేమ్‌జిత్ రాయ్‌ను పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, పీడియాట్రిక్ సర్జరీ విభాగ ప్రొఫెసర్ జి.రాజేంద్రప్రసాద్‌ను ఏలూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మైక్రోబయాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి.కమలను మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా, కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ డి.హేమలతను పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: రాష్ట్రంలో 434 స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. అందులో భాగంగా జోన్–1 పరిధిలో 86 పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ డాక్టర్ ఉమా సుందరి తెలిపారు. గురువారం నుంచి వచ్చే నెల 5 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను డీఎంహెచ్‌వో కార్యాలయం మేడ మీద గల వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను http@// cfw.ap.nic.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

జీవీఎంసీ చెత్త తరలింపు వాహనం బోల్తా



జాతీయ రహదారిపై బోల్తా పడిన జీవీఎంసీ గార్బేజ్ వాహనం

పీఎంపాలెం: డంపింగ్ యార్డుకు చెత్తను తరలించే జీవీఎంసీ గార్బేజ్ వాహనం మంగళవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో మారికవలస మలుపు వద్ద హైవేపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. భారీ క్రేన్ల సాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాన్ని తొలగించి.. పరిస్థితిని చక్కదిద్దారు.

బెంగళూరు-హౌరా రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: ఎస్‌ఎంవీ బెంగళూరులో బుధవారం ఉదయం 10.35 గంటలకు బయల్దేరాల్సిన ఎస్‌ఎంవీ బెంగళూరు-హౌరా(12864) ఎక్స్‌ప్రెస్ సుమారు 2 గంటలు ఆలస్యంగా 12.30 గంటలకు బయల్దేరింది. ఈ రైలుకు సంబంధించిన ఒక కోచ్‌లో మెకానికల్ సమస్య తలెత్తడంతో ఆలస్యంగా బయల్దేరినట్లు, అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకోనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ఏఐఎన్‌యూలో ఏషియన్ హెల్త్ కేర్ హోల్డింగ్స్‌కు మెజార్టీ వాటా

మహారాణిపేట: సింగిల్ స్పెషాలిటీ హెల్త్ కేర్ డెలివరీ ప్లాట్‌ఫాం అయిన ఏషియన్ హెల్త్ కేర్ హోల్డింగ్(ఏహెచ్‌హెచ్) సంస్థ.. యూరాలజీ, నెఫ్రాలజీ విభాగాలకు గానూ దేశంలోనే అతి పెద్ద సింగిల్ స్పెషాలిటీ ఆస్పత్రి అయిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ(ఏఐఎన్‌యూ)లో మెజార్టీ వాటాను దక్కించుకుంది. ఏఐఎన్‌యూకు దేశంలోని నాలుగు ప్రధాన నగరాల్లో ఆస్పత్రులు ఉండటంతోపాటు రొబోటిక్ యూరాలజీ సర్జరీలు చేయడంలో ముందంజలో ఉంది. ప్రైమరీ, సెకండరీ ఇన్‌ఫ్యూజన్ల ద్వారా ఏహెచ్‌హెచ్ ఈ సంస్థలో రూ.600 కోట్లను పెట్టుబడి పెట్టింది. తద్వారా ఆసియా ఉప ఖండంలోనే అతిపెద్ద ఏకైక సింగిల్ స్పెషాలిటీ హెల్త్ కేర్ డెలివరీ ప్లాట్‌ఫాంగా అవతరించింది.

‘బాల్యం బడి’పై మరింత ఫోకస్

- చిన్నారుల చదువులు సవ్యంగా సాగేలా ఏర్పాట్లు
- ఐసీడీఎస్ ద్వారా పౌష్టికాహారం
- కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు చర్యలు
- జిల్లాలోని 37 బాల్యం బడి కేంద్రాల్లో 900 మంది విద్యార్థులు



బాల్యం బడి నిర్వహిస్తొన్న నగరంలోని కరాస మున్సిపల్ స్కూల్

విశాఖ విద్య: బాల్యం బడిలో చిన్నారుల చదువులు సవ్యంగా సాగేలా అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందుతోంది. ఇలాంటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టారు. బాల్యం బడి కేంద్రాల్లోని చిన్నారులకు అంగన్‌వాడీల మాదిరే స్త్రీ శిశు సంక్షేమశాఖ ద్వారా పౌష్టికాహారం సరఫరా చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇది కార్యరూపం దాల్చితే గ్రేటర్ విశాఖ మహానగరపాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్న 37 కేంద్రాల్లోని 900 మంది చిన్నారులకు రోజూ పౌష్టిక విందు అందనుంది.

బడిబాట పట్టించేలా..

మూడు నుంచి ఆరేళ్ల మధ్య వయస్సు గల చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించి, వారిని బడిబాట పట్టించాలనేది బాల్యం బడి కేంద్రాల లక్ష్యం. జీవీఎంసీ అర్బన్ కమ్యూనిటీ డవలెప్‌మెంట్ (యూసీడీ) ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తున్నారు. నగరంలోని వెనుకబడిన కాలనీలు, స్లమ్ ఏరియాల్లో వీటిని ఏర్పాటు చేశారు. విశాఖ నగరంలో మొదట్లో 61 బాల్యం బడి కేంద్రాలు ఉండగా, వీటిలో 24 కేంద్రాలను నాలుగేళ్ల క్రితం స్త్రీ శిశు సంక్షేమశాఖకు అప్పగించారు. ఇంకా 37 కేంద్రాలను జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు. ప్రతీ కేంద్రంలో ఒక టీచర్, ఒక ఆయా విధుల్లో ఉన్నారు. కేంద్రాల పర్యవేక్షణకు నలుగురు సూపర్ వైజర్లు, జీవీఎంసీ పరిధిలో వీటి కోసమని ప్రత్యేకంగా ఓ ప్రాజెక్టు అధికారి ఉన్నారు.

ఐసీడీఎస్‌కు అప్పగిస్తే మరింత మేలు

మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయస్సు మధ్య గల చిన్నారుల కోసం అంగన్‌వాడీల్లో ఇప్పటికే ప్రీ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. రుచికరమైన పౌష్టికాహారం అందిస్తుండటంతో పాటు, ఆటపాటలతో చదువులు చెబుతున్నారు. వీటితో సంబంధం లేకుండా, జీవీఎంసీ ఆధ్వర్యంలో బాల్యం బడి కేంద్రాలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. కానీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు జీవీఎంసీ అధికారులు ఎటువంటి పౌష్టికాహారం పెట్టడం లేదు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు కేంద్రాలను నిర్వహిస్తున్నా, మధ్యాహ్న భోజనం వేళలో పిల్లలకు వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకుపోతున్నారు. ఫలితంగా బాల్యం బడి కేంద్రాల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదు.

ఆటపాటలతో చదువులు చెబుతున్నాం



బాల్యం బడికి వచ్చే పిల్లలకు ఆటపాటలతో చదువులు చెబుతున్నాం. కేంద్రాలు ప్రారంభం నుంచి కూడా తాను విధుల్లో ఉన్నాను. నెలకు రూ.7 వేలు వేతనం ఇస్తున్నారు. మా స్కూల్లో పిల్లలకు జీవీఎంసీ స్కూల్ వారు భోజనం పెడుతున్నారు. గుడ్డు ఇవ్వడం లేదు.

–ముదునూరి రత్నకుమారి, బాల్యం బడి టీచర్, కరాస

మధ్యాహ్న భోజనం పెడితే మేలు



నాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయిని బాల్యం బడికి పంపించాను. ఆరేళ్లు నిండిన తరువాత జీవీఎంసీ స్కూల్లో చేర్పించాను. ఇప్పుడు చిన్న అమ్మాయిని కూడా బాల్యం బడికి తీసుకొస్తున్నాను. అంగన్‌వాడీలో మాదిరే ఇక్కడ కూడా భోజనం పెడితే బాగుంటుంది.

–కుంచా ఝాన్సీ, విద్యార్థి తల్లి

ఉన్నతాధికారులకు నివేదించాం



బాల్యం బడి కేంద్రాలను జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహి స్తున్నారు. అక్కడి పిల్లలు తమ వద్ద నమోదు ఉండదు. పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వా లని జీవీఎంసీ వారి నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వీటిని మా శాఖ ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

– డి. వెంకటేశ్వరి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి, విశాఖ జిల్లా

పౌష్టికాహారం అందించేలా ఏర్పాట్లు

బాల్యం బడి నిర్వహణపై దృష్టి సారించాం. చిన్నారులకు పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. అంగన్‌వాడీల మాదిరే బాల్యం బడి పిల్లలకు కూడా పౌష్టికాహారం, పాలు, గుడ్లు ఇవ్వాలని కమిషనర్ ద్వారా ఐసీడీఎస్ వారికి లేఖ రాశాం. త్వరలోనే పిల్లలకు పౌష్టికాహారం అందించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం.

–రత్నాకర్, బాల్యం బడి ప్రాజెక్టు అధికారి, జీవీఎంసీ

ముడసర్లోవ పార్కు ఆధునికీకరణకు చర్యలు



ముడసర్లోవ పార్కులో చేపట్టాల్సిన పనులు గురించి అధికారులకు వివరిస్తున్న కమిషనర్

ఆరిలోవ: ముడసర్లోవ పార్కును ఆధునికీకరణకు చర్యలు చేపడుతున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలసి ఆయన బుధవారం ముడసర్లోవ పార్కును సందర్శించారు. ఇక్కడ పార్కు, రిజర్వాయరు గట్టు పైభాగం పరిశీలించారు. పార్కులో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలి? సందర్శకులను ఆకట్టుకునే విధంగా ఏఏ ఏర్పాట్లు చేయాలి? తదితర వాటి గురించి అధికారులతో చర్చించారు. పార్కు ఆధునికీకరణకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. పార్కులో అపారిశుధ్యంపై 13వ వార్డు శానిటరీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కును మరింత సుందరీకరణ చేయదలిచినట్లు తెలిపారు. రామకృష్ణాపురంలో గత ఏడాదిలో శంకుస్థాపన జరిగిన బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోన్-2 జెడ్సీ కనకమహలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజనీర్ మత్స్యరాజు, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్ వంశీ పాల్గొన్నారు.

బలమైన సాక్ష్యాలతోనే చంద్రబాబుకు రిమాండ్

క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ



సీతంపేట: చంద్రబాబు నాయుడు, అతని కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకుల తీరు చూస్తుంటే దొంగే.. దొంగ దొంగ అని అరుస్తూ తప్పించుకొని పారిపోవడానికి ప్రయత్నించినట్టు ఉందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. లలితానగర్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రజాధనం దుర్వినియోగం అయిందని బలమైన ఆరోపణలు, సాక్ష్యాధారాలు ఉన్నందునే చంద్రబాబు నాయుడికి న్యాయస్థానం 14 రోజులు రిమాండ్ విధించిందని తెలిపారు. స్వయంగా చంద్రబాబు తన ఎన్నికల అఫిడవిట్‌లో తనపై తొమ్మిది క్రిమినల్ కేసులు ఉన్నాయని పేర్కొనడం జరిగిందని గుర్తుచేశారు. ఆ కేసుల సమయంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో లేకపోయినా, ఇపుడు జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెబుతున్న చంద్రబాబు ఆ తొమ్మిది కేసులకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. 17 కేసుల్లో స్టేలు తెచ్చుకుని రాష్ట్రంలో నాయకుడిగా చలామణి అవుతున్న చంద్రబాబు బండారం స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తెలిసిందన్నారు. ఎవరైనా అన్ని రోజులూ అందరినీ మోసం చేయలేరనడానికి చంద్రబాబు ఉదంతమే నిదర్శనమన్నారు. స్కాం జరగలేదని పచ్చ పత్రికల్లో ఎంత ప్రచురించినా ప్రజలు వాటిని నమ్మేపరిస్థితిలో లేరన్నారు. అసలు స్కాం జరగలేదని సీమెన్స్ ఎండీ సౌమ్యాద్రి శేఖర్ బోస్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ కెన్విల్కర్ల చేత పచ్చ పత్రికల్లో ఇంటర్వ్యూలు ఇప్పించి ప్రజలను తప్పుదారి పట్టిద్దామని అనుకున్నారని, అసలు ఈ ఇద్దరినీ ఇదే కేసులో విశాఖలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసి బెయిల్‌పై విడుదల చెయ్యడం జరిగిందన్న విషయాన్ని పచ్చపత్రికలు దాచిపెట్టాయన్నారు. రూ.112 కోట్ల ఏపీఫైబర్ నెట్‌స్కాం, అమరావతి రింగ్ రోడ్డు స్కాం, అమరావతి భూసేకరణ స్కాంలలో చంద్రబాబుకి న్యాయస్థానాలు భారీ శిక్షలు విధించే అవకాశం ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అలిముద్దీన్ మృతదేహం వద్ద పోలీసులు

గోపాలపట్నం: పంజాబ్ హోటల్ జంక్షన్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మదర్సాలో చదువుతున్న అలిముద్దీన్(18) బిర్లా జంక్షన్ నుంచి సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై ఎన్‌ఏడీ వైపు వస్తుండగా.. ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టడంతో దాని వెనుక చక్రాల కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎయిర్‌పోర్టు పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను, ఆధారాలను సేకరించారు. అలిముద్దీన్ గతంలో బిర్లా జంక్షన్ బిర్యానీ పాయింట్(తోపుడు బండి)లో పనిచేస్తుండేవాడు. మృతుడి కుటుంబ వివరాలు తెలియరాలేదు. మదర్సా నిర్వాహకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్ట్ ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు.

విశాఖ అభివృద్ధికి అధ్యయన యాత్ర దోహదం

- డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: అందరి కార్పొరేటర్ల సమష్టి కృషితో విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు శ్రీనగర్, పహల్గామ్, కాట్రా, అమృత్‌సర్ తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ కార్పొరేటర్లు అధ్యయన యాత్ర చేశారు. ఈ విశేషాలను జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం వారు విలేకరులకు వివరించారు. 73 మంది కార్పొరేటర్లు, 16 మంది కార్యాలయ సిబ్బంది అధ్యయన యాత్రకు వెళ్లినట్లు చెప్పారు. ఈ నెల 11న శ్రీనగర్ మేయర్ జునైద్ ఆజిమ్ మతూ, జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి అధ్యక్షతన సమావేశం జరిగిందన్నారు. అక్కడి మేయర్ శ్రీనగర్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారన్నారు. అక్కడి పురాతన, చారిత్రాత్మక కట్టడాలు, రోడ్ల విస్తరణ, సుందరీకరణ, జీలం నది, దాల్ లేక్ నిర్వహణ తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించినట్లు చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ, పూడికల తొలగింపు, యాంత్రిక విభజన, కంపోస్టింగ్, అమృత్ పథకం కింద చేపట్టిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం, ఉద్యానవనాల అభివృద్ధి, డ్రైనేజీ, డీ వాటరింగ్ ప్లాంట్ నిర్మాణం, ఇంటెలిజెంట్ ట్రాఫికింగ్ వ్యవస్థ, వాటి పని తీరును అక్కడి సభ్యులు వివరించినట్లు చెప్పారు. జీవీఎంసీలో అమలవుతున్న పలు అభివృద్ధి పనులు, శానిటేషన్, పార్లే సంస్థ-జీవీఎంసీ సంయుక్తంగా నిర్వహించిన మెగా బీచ్ క్లీన్ అప్ కార్యక్రమం తదితర వివరాలను మేయర్ వారికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారన్నారు. జీవీఎంసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎకో వైజాగ్ కార్యక్రమం గురించి తెలియజేసినట్లు చెప్పారు.

పలు ప్రాంతాల సందర్శన

12న పహల్గామ్ సమీపంలోని మినీ స్విట్జర్లాండ్, పలు సందర్శన ప్రదేశాలు, 13న కాట్రా, 14న మాతా వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించామన్నారు. 15న వాఘా బోర్డర్‌లో పరేడ్‌ను తిలకించినట్లు చెప్పారు. అనంతరం అమృత్‌సర్‌లోని స్వర్ణ ఆలయాన్ని సందర్శించినట్లు వివరించారు. 16న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అధ్యక్షతన అమృత్‌సర్ నగరపాలక సంస్థలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులు, చెత్త నిర్వహణ, హోం కంపోస్టింగ్ యూనిట్ల ఏర్పాటు, వాటి పనితీరు, నిర్వహణ, వేస్ట్ ప్రాసెసింగ్ విధానంలో చేపట్టిన బయో రీమిడియేషన్, వేస్ట్ నుంచి ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం, 3డీ వేస్ట్ నుంచి ఎనర్జీ ప్లాంట్ నిర్మాణాల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. జీవీఎంసీలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, పారిశుధ్యం తదితర అంశాలను సీపీఐ ఫ్లోర్ లీడర్ ఎ.జె.స్టాలిన్ వారికి వివరించారన్నారు.

అందరి కృషితో..

విశాఖను మరింతగా అభివృద్ధి చేసేందుకు ఈ అధ్యయన యాత్ర దోహదపడుతుందని వారు తెలిపారు. శ్రీనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. జీవీఎంసీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు కూడా వారికి వివరించామన్నారు. రైవాడ, ముడసర్లోవ, మేహాద్రి గెడ్డలో పూడికలు తొలగించేందుకు శ్రీనగర్ తరహాలో చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని వారు వెల్లడించారు.

22న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) ఓ ప్రకటనలో తెలిపారు. వాల్‌మార్ట్, బిగ్ సీ మొబైల్స్, మెడ్ ప్లస్, బిగ్ బాస్కెట్, టీం లీజ్, యూనియన్ బ్యాంక్, మహాదేవ్ షిప్పింగ్, శ్రీరామ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీల్లో 685 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ఫ్లోర్ అసోసియేట్, వ్యాన్ డెలివరీ బాయ్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మాసిస్ట్, అసెంబ్లీ ఆపరేటింగ్ కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, పిక్కర్స్, డెలివరీ ఎగ్జిక్యూటివ్ అసోసియేట్, డ్యూటీ మెడికల్ ఆఫీసర్, వేర్‌హౌస్ అసోసియేట్స్, టీం లీడర్స్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు భర్తీ చేస్తారు. ఆయా ఉద్యోగాలకు ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ, ఐటీఐ, బీటెక్, ఎంబీఏలో ఉత్తీర్ణత సాధించిన 18-35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆసక్తి గల అభ్యర్థులు https:// www.ncs. gov.in/ లో పేర్లు నమోదు చేసుకుని శుక్రవారం జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వారు కోరారు.

23న ఏయూలో..

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కేంద్రం డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్‌లో ట్రైనీ కెమిస్ట్, జూనియర్ కెమిస్ట్ ఉద్యోగాల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులు. ట్రైనీ కెమిస్ట్‌కు నెలకు రూ.19 వేలు, జూనియర్ కెమిస్ట్‌కు సీటీసీగా రూ.3.5 లక్షల వేతనం అందిస్తారు. మెడ్ ప్లస్ ఇండియా లిమిటెడ్‌లో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ఎయిడ్, ఫార్మసీ అసిస్ట్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, డెలివరీ బాయ్ తదితర ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారు. 10వ తరగతి నుంచి డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చదివిన వారు ఈ ఉద్యోగాలకు అర్హులు. 20 నుంచి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు హాజరుకావచ్చు. వీరికి వేతనంగా నెలకు రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన వారు https:// www.ncs.gov.in/ లో పేర్లు నమోదు చేసుకుని జాబ్‌మేళాకు హాజరుకావచ్చు. పూర్తి వివరాలకు 96660 92491, 87122 88599ను సంప్రదించాలని దొరబాబు కోరారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,220
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,200
వెండి(కిలో):	రూ.78,000

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం	: రూ.115
బ్రాయిలర్ (లైవ్)	: రూ.135
స్కిన్	: రూ.240
స్కిన్‌లెస్	: రూ.250

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	535.00
విజయనగరం	539.00
శ్రీకాకుళం	539.00

వెళ్లి రావయ్యా.. గణపయ్యా..

విఘ్నాలు తొలగించే గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుతున్నాడు. వినాయక చవితి మొదటి రోజు ఇంట్లో పూజలు చేసిన వినాయక విగ్రహాలను నగర ప్రజలు సముద్రంలో నిమజ్జనం చేశారు. అపార్ట్‌మెంట్లు, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో విశాఖ నగరం సందడిగా మారింది. చిన్నారులు, యువత కేరింతలు.. డీజేలు, బ్యాండు మేళాలు, డప్పు చప్పుళ్లు హోరెత్తాయి. ఊరేగింపుగా వెళ్లిన భక్తులు పెదజాలారిపేట సాగరతీరంలో బొజ్జ గణపయ్యను నిమజ్జనం చేశారు. మహిళలు ద్విచక్ర వాహనాలు, కార్లలో వినాయకులను తీసుకువచ్చి గంగమ్మ చెంతకు చేర్చారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు. మండపాల వద్ద వినాయకుని పూజలందుకున్న లడ్డూలకు డిమాండ్ పెరిగింది. వేలం పాటల్లో లడ్డూను దక్కించుకోవడానికి భక్తులు పోటీ పడ్డారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం













